ప్రజాశక్తి

మంగళవారం 26 ఆగస్టు 2025 | 5 | విజయనగరం

శ్రీదేవికి తెలుగు తేజం పురస్కారం

ప్రజాశక్తి - చీపురుపల్లి

తెలుగు భాషలో విశిష్ట సేవలు అందించిన ఉపాధ్యాయిని శ్రీదేవికి తెలుగు తేజం అనే అవార్డు దక్కింది. మండలంలోని పెదనడిపల్లి క్లస్టర్ గొల్లలములగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంటిఎస్ ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న గంపా శ్రీదేవికి తెలుగు భాషా సేవా పురస్కారం 'తెలుగు తేజం' అవార్డు దక్కింది. రెండు తెలుగు రాష్ట్రాల్లో జరిగిన తెలుగు భాషలో పలు రచనలు, పద్య కావ్యం రాసి పలువురికి ఆదర్శంగా నిలవడమే కాకుండా తెలుగు భాష పట్ల శ్రీదేవికి ఉన్న అభిమానాన్ని దృష్టిలో పెట్టుకుని తెలుగు తేజం అవార్డు వరించింది. ఈ మేరకు ఈ నెల 31వ తేదీన కళావేదిక ఆధ్వర్యంలో పల్నాడు జిల్లా నరసారావుపేటలో ఈ అవార్డు ప్రధానం జరుగుతుందని ఆమె తెలిపారు. పలువురికి తెలుగు భాష పట్ల ఆదర్శంగా నిలిచినందుకుగాను శ్రీదేవికి ఈ పురస్కారం లభించడం పట్ల మండలంలోని పలువురు ఆమెను అభినందించారు.

కలెక్టరేట్‌ను ముట్టడించిన విద్యార్థులు

విద్యారంగ సమస్యలపై కదంతొక్కిన విద్యార్థులు

- 3 వేల మందితో ర్యాలీ
- ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన కలెక్టరేట్ ముట్టడి, రాస్తారోకో
- వారం రోజుల్లో సమస్య పరిష్కారం కాకపోతే అసెంబ్లీ ముట్టడిస్తామని హెచ్చరిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన వేలాది మంది విద్యార్థులు కదం తొక్కారు. సోమవారం ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ చేపట్టి, అనంతరం అక్కడ పెద్దఎత్తున ధర్నా, రాస్తారోకో చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు డి.రాము, సిహెచ్ వెంకటేష్ మాట్లాడుతూ అధికారంలోకి వచ్చి 15 నెలల గడుస్తున్నా విద్యారంగ సమస్యల పరిష్కార దిశగా కూటమి ప్రభుత్వం కృషి చేయడం లేదని దుయ్యబట్టారు. రాష్ట్రంలో ఉన్నత విద్య చదివే విద్యార్థులకు రూ.6400 కోట్ల స్కాలర్‌షిప్ పెండింగ్‌లో ఉందని, తక్షణమే వాటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రధానంగా గజపతినగరం, విజయనగరం, రాజాం ప్రాంతాల్లో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలకు సొంత భవనాలు లేకపోవడంతో తరగతుల నిర్వహణ అధ్వానంగా మారిందన్నారు. తక్షణమే ఈ మూడు ప్రాంతాల్లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల నిర్మాణం చేయాలని కోరారు. మరోవైపు సంక్షేమ హాస్టళ్ల పరిస్థితి అధ్వానంగా తయారైందని, శిథిలావస్తలో ఉన్న సంక్షేమ హాస్టల్స్ కి సొంత భవనాలు నిర్మించాలని, మెస్ ఛార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. అధికారంలోకి వస్తే జీవో 77ను రద్దు చేసి పిజి విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అమలు చేస్తామని రెండేళ్ల క్రితం పాదయాత్రలో హామీ ఇచ్చిన నారా లోకేష్ వెంటనే ఆ హామీని అమలు చేయాలని డిమాండ్ చేవారు. రాష్ట్రంలో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తున్నారని, ఇదే సందర్భంలో విద్యార్థినులకు వారు మహిళలైనా సరే బడి బస్సుల్లో వేలాది ఫీజులు చెల్లిస్తూ బస్‌పాసులు తీసుకోవాల్సిన దౌర్భాగ్య పరిస్థితి ఎదురైందని, కావున తక్షణమే విద్యార్థులందరికీ ఉచిత బస్సు పాసులు అందించాలని డిమాండ్ చేశారు. వీటితోపాటు రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న యూనివర్సిటీ విసి పోస్టులు, లెక్చరర్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. జెఎన్‌టియుకు నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలని, సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ నిర్మాణం వేగవంతం చేయాలని, మెడికల్ కళాశాల నిర్మాణం వేగవంతం చేసి కళాశాలలో ఉన్న సీట్లన్నీ కన్వీనర్ కోటాలోనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలను పరిష్కరించకుండా రాష్ట్ర ప్రభుత్వం సమస్యలపై ప్రశ్నిస్తున్న విద్యార్థి సంఘాల నిషేధ సర్క్యులర్ తీసుకురావడం సిగ్గుచేటని అన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం రాజ్యాంగ విరుద్ధ సర్కిలర్ను వెనక్కి తీసుకోవాలని కోరారు. అనంతరం విద్యార్థి ప్రతినిధులు ఎస్ఎఫ్ఐ నాయకులు కలిసి జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్‌కు వినతిపత్రం అందజేశారు. వారం రోజుల్లో సమస్యలు పరిష్కారం కాకపోతే రాష్ట్ర అసెంబ్లీని ముట్టడిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు జె.రవికుమార్, ఎం. వెంకీ, సమీరా, రమేష్, జిల్లా సహాయ కార్యదర్శులు శిరీష , రాజు జిల్లా కమిటీ సభ్యులు భారతి , రూప, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌కు ర్యాలీగా వస్తున్న విద్యార్థులు, ఎస్ఎఫ్ఐ నాయకులు

నిరసన తెలుపుతున్న వికలాంగులు

పింఛన్ల తొలగింపుపై వికలాంగుల నిరసన

ప్రజాశక్తి- కంటోన్మెంట్

రాష్ట్ర ప్రభుత్వం రీ వెరిఫికేషన్ పేరుతో పింఛన్లను తొలగించడాన్ని నిరసిస్తూ వికలాంగులు సిపిఎం, వైసిపి వికలాంగుల విభాగం ఆధ్వర్యాన వేర్వేరుగా సోమవారం కలెక్టరేట్ వద్ద ఆందోళనలు చేపట్టారు. పింఛన్లపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్న తమ పొట్ట కొట్టొద్దంటూ వారంతా నినాదాలు చేశారు. రీ వెరిఫికేషన్ పేరుతో సదరం సర్టిఫికెట్లతో వికలాంగ శాతం తగ్గించి పింఛన్ల తొలగింపునకు నోటీసులు అందజేశారని ఆవేదన చెందారు. పెన్షన్ తొలగింపు నిరసనగా జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద వైసిపి వికలాంగుల విభాగం ఆధ్వర్యాన నిరసన తెలిపారు. అనంతరం నినాదాలు చేసుకుంటూ కలెక్టరేట్ మెయిన్ గేటు వద్దకు చేరుకొని నిరసన తెలిపారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని జిల్లా అధికారులకు అందించారు. అంతకుముందు ధర్నానుద్దేశించి వికలాంగుల విభాగం జిల్లా అధ్యక్షులు కొండబాబు మాట్లాడుతూ మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో 1,20,000 మంది, జిల్లాలో 7వేల మంది వికలాంగుల పింఛన్లను ప్రభుత్వం తొలగించిందని అన్నారు. సదరం సర్టిఫికెట్ రీ వెరిఫికేషన్ లో 90 శాతం ఉన్న వికలాంగులకు 40 శాతం లోపు వేసి అనర్హులుగా చేశారన్నారు. 2019 నుంచి20 24 వరకు ఇచ్చిన పింఛన్లను రీ వెరిఫికేషన్ చేస్తున్నామని చెబుతున్న ప్రభుత్వం ఎన్‌టి రామారావు ముఖ్యమంత్రిగా చేసిన దగ్గర నుంచి పింఛన్లు పొందుతున్న అర్హులను కూడా తొలగించారని అన్నారు. తొలగించిన వికలాంగ పెన్షన్లను పునరుద్ధరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

తొలగించిన పింఛన్లు కొనసాగించాలని ధర్నా

విజయనగరంటౌన్ : రీ వెరిఫికేషన్ పేరుతో రాష్ట్ర ప్రభుత్వం తొలగించిన వికలాంగుల పింఛన్లను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యాన సోమవారం కలెక్టరేట్ వద్ద వికలాంగులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రెడ్డి శంకర్రావు మాట్లాడుతూ రీవెరిపికేషన్ పేరుతో రాష్ట్రంలో లక్షలాది అర్హులైన వికలాంగుల ఫించన్లు తొలగించడం అత్యంత దుర్మార్గమైన చర్య అని అన్నారు. పెన్షన్లు తొలగించడం వల్ల చాలా మంది దానిపైనే ఆధారపడిన వారు రోడ్డున పడుతున్నతారన్నారు. ఏపనికీ వెళ్లలేక, జీవనోపాధిలేక ఉన్న పింఛన్లు పోవడంతో ఆర్థికంగా నలిగిపోతున్నారన్నారు. తక్షణం తొలగించిన ఫించన్లు కొనసాగించాలని డిమాండ్ చేశారు. అనంతరం ప్రజా పిర్యాదులు పరిష్కార వేదికలో కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ధర్నాలో సిపిఎం నాయకులు పి.రమణమ్మ, ఎ.జగన్మోహనరావు, బి.రమణ, వికలాంగులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద సిపిఎం ఆధ్వర్యాన ధర్నా చేస్తున్న వికలాంగులు

యూరియా కోసం రైతుల పాట్లు

- పంపిణీ చేయకుండానే వెనుదిరిగిన అధికారులు
- అదనంగా రూ.20 వసూలు చేస్తున్న వ్యవసాయ అధికారులు

ప్రజాశక్తి- రేగిడి

మండలం లో యూరియా కోసం రైతులు పడరానిపాట్లు పడుతున్నారు. 25 రైతు సేవా కేంద్రాలలో యూరియా కోసం రెండు నెలలుగా ఎదురుచూస్తూ ప్రైవేట్ దుకాణాలలో అధిక ధరలకు కొనుగోలు చేస్తూ ఖరీఫ్ వ్యవసాయ పంటలు పండించుకునే దుస్థితి నెలకొంది. మండలంలోని సంకిలి సచివాలయంలో సోమవారం వ్యవసాయ అసిస్టెంట్లు యూరియా పంపిణీ చేస్తారని తెలుసుకున్న సంకిలి, బొడ్డవలస, చిన్నయ్యపేట గ్రామాల రైతులు వర్షానికి లెక్కచేయకుండా గొడుగులతో సచివాలయానికి చేరుకున్నారు. వాస్తవంగా శుక్రవారం సచివాలయానికి 450 యూరియా బస్తాలను లారీ నుంచి వ్యవసాయ అసిస్టెంట్లు దించారు. అయితే వీటిలో 225 యూరియా బస్తాలు వేరే పంచాయతీకి తరలించడంతో ఇక్కడ ఉన్న కొద్దిపాటి యూరియా బస్తాలను పంపిణీ చేయడానికి వ్యవసాయ అసిస్టెంట్లు రంగం సిద్ధం చేశారు. దీంతో రైతులు ఎక్కువ మంది యూరియా కోసం అక్కడకు చేరుకున్నారు. ఫలితంగా చాలీచాలని యూరియా బస్తాలతో ఎలా పంపిణీ చేసేదని వ్యవసాయ అసిస్టెంట్లు తర్జన భర్జన పడ్డారు. ఏదో విధంగా పంపిణీ చేద్దామని అనుకున్న తరుణంలో యూరియా బస్తా 270 రూపాయలకు రైతులకు రాయితీతో విక్రయించాల్సి ఉన్నా 290 రూపాయలు తీసుకోవడంపై రైతులు అభ్యంతరం వ్యక్తం చేశారు. అయినా అదనంగా 20 రూపాయలు ఇచ్చేందుకు అంగీకరించారు. చాలీచాలని యూరియా బస్తాలతో ఇబ్బందులు ఎదుర్కొంటామని భావించి వ్యవసాయ అసిస్టెంట్లు తప్పించుకునేందుకు ప్రయత్నించారు. దీంతో రైతులు, వ్యవసాయ అధికారులతో వాగ్వివాదానికి దిగారు. ఇంకా ఉంటే రైతులు మీదపడి ఇబ్బందులు పెడతారని ఉద్దేశంతో వ్యవసాయ అసిస్టెంట్లు వెనుతిరిగి ఉంగరాడ సచివాలయానికి జారుకున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి పూర్తిస్థాయిలో యూరియా తెప్పించేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

యూరియా కోసం వ్యవసాయ అసిస్టెంట్లతో వాగ్వివాదానికి దిగిన రైతులు

యూరియా కొరత లేదు.. ఆందోళనొద్దు

అక్రమ నిల్వలపై నిఘా ఉంచండి : కలెక్టర్ బిఆర్ అంబేద్కర్

ప్రజాశక్తి-విజయనగరంకోట, కంటోన్మెంట్

జిల్లాలో ఎక్కడా యూరియా కొరత లేదని, రైతులు ఆందోళన చెందవద్దని జిల్లాకు సరిపడా యూరియా ఇప్పటికే అందుబాటులో ఉందని జిల్లా కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్ స్పష్టం చేసారు. సోమవారం పిజిఆర్ఎస్ అనంతరం అధికారులు, తహశీల్దార్లతో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాకు 36 వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా 32మెట్రిక్ టన్నుల వరకు పంపిణీ జరిగిందని, మరో 3 వేల మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉందని తెలిపారు. అయితే భవిష్యత్ అవసరాల కోసమని రైతులు అదనంగా యూరియాను తీసుకొని నిల్వ చేస్తున్నట్లు తెలుస్తోందని, దీనిని అరికడితే రైతులందరికీ యూరియా సరిపోతుందని తెలిపారు. ఎంత వినియోగించాలి , ఎలా వినియోగించాలి అనే విషయాల పై రైతులకు ఆర్ఎస్‌కె సిబ్బంది అవగాహన కలిగించాలని తెల్పారు. ఎరువుల పర్యవేక్షణకు మండల స్థాయిలో తహశీల్దార్, ఎస్‌హెచ్ఒ, డిటిలను బృందంగా నియమించామని, వీరు మండలాల్లో పర్యటించి, అక్రమ నిల్వల పై నిఘా ఉంచాలని ఆదేశించారు.

నా ఉద్యోగం ఇప్పించండి

గజపతినగరం రూరల్ : తన ఉద్యోగం తిరిగి ఇప్పించాలని కోరుతూ గజపతినగరం మండలంలోని శ్రీరంగరాజపురం గ్రామానికి చెందిన మామిడి శాంతికుమారి.. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన పిజిఆర్ఎస్‌లో జెసి సేతు మాధవన్‌కు వినతి అందించారు. విఒఎగా 2014 నుంచి పనిచేస్తున్నానని, ఈ నెల ఒకటో తేదీ నుంచి విధులకు హాజరు కావద్దని వెలుగు ఎపిఎం, సిసి చెప్పారని ఆమె వివరించారు. రాజకీయ ఒత్తిళ్లతో తనను తొలగించినట్లు చెబుతున్నారన్నారు. సిసి సత్యనారాయణ తనకు తెలియకుండా గ్రామంలో రాత్రి 7 గంటల సమయంలో పొదుపు సంఘాలతో సమావేశం ఏర్పాటు చేసి, దొంగచాటుగా తనను తొలగిస్తున్నట్లు తీర్మానం చేశారని బాధిత మహిళ వాపోయారు. రాజకీయ వేధింపులు ఆపి ఉద్యోగం తిరిగి ఇప్పించాలని కోరారు.

రానున్న 3 రోజుల్లో భారీ వర్షాలు

బంగాళా ఖాతం లో అల్ప పీడనం ఏర్పడిన దృష్ట్యా రానున్న మూడు రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ డ బి.ఆర్.అంబేద్కర్ ఆదేశించారు. భారీ వర్షాలకు పంట నష్టం జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, చెరువులు, కాల్వల గట్లు పటిష్టంగా ఉండేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ మూడు రోజులు అధికారులు ఎటువంటి సెలవులు పెట్టరాదని తెలిపారు.

జెసికి వినతి అందిస్తున్న విఒఎ శాంతికుమారి

పిజిఆర్ఎస్ కు 188 వినతులు

ప్రజా వినతుల పరిష్కార వేదికకు వచ్చే వినతులను లాగిన్ లో అధికారులు ఎప్పటికప్పుడు చూడాలని కలెక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలిపారు. పిజిఆర్ఎస్ లో కలెక్టర్ ప్రజల నుండి వినతుల స్వీకరించారు. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడుతూ గడువు లోపలే వినతులకు సమాధానాలు పంపాలని , లేని యెడల సంబందిత అధికారి పై చర్యలు తప్పవని హెచ్చరించారు. పిజిఆర్ఎస్‌కు 188వినతులు అందగా అత్యధికంగా రెవెన్యూశాఖకు సంబంధించి 68 వినతులు అందాయి. కలెక్టర్ తో పాటు సంయుక్త కలెక్టర్ సేతు మాధవన్, డిఆర్ఒ శ్రీనివాస మూర్తి, విజయనగరం డిప్యూటీ కలెక్టర్లు వెంకటేశ్వర రావు, ప్రమీల గాంధీ, మురళి జల నుంచి వినతులు స్వీకరించారు.

ధాన్యం బస్తా బరువు 50 కిలోలకు తగ్గించాలి

విజయనగరం టౌన్ : 100, 80 కేజీలు ఉన్న ధాన్యం బస్తా బరువును 50 కేజీలకు తగ్గించాలని రాజాం రైస్ అండ్ ఆయిల్ మిల్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో జాయింట్ కలెక్టర్‌కు వినతి అందజేశారు. బస్తాను మోయడం కష్టంతో కూడుకున్న పనని, పొరపాటున బస్తా జారినా, కాళ్లు జారినా కార్మికుని ప్రాణానికే ప్రమాదం వాటిల్లే అవకాశముందని తెలిపారు. 50 కేజీల బస్తాలను కార్మికులు మోసేలా రైస్ మిల్లు యాజమాన్యాలకు, అన్ని ఆర్ఎస్‌కెలకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.శంకర్రావు, కె.సురేష్, యూనియన్ అధ్యక్షులు గార కంచినాయుడు, కార్యదర్శి జి.శ్రీనివాసరావు, జి. సూర్యనారాయణ, వి. వెంకటరమణ, వి.సింహాచలం, సీతారాం, రాము పాల్గొన్నారు.

రూ.18,500 వేతనం ఇవ్వాలి

రామతీర్థాలు, ముషిడిపల్లి, నెలిమర్ల పంపు హౌస్ కార్మికులకు ఆప్కాస్ కార్మికులతో సమానంగా రూ. 18,500 వేతనం చెల్లించాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) జాయింట్ కలెక్టర్ సేతు మాధవ్ కు, మున్సిపల్ ఆఫీసులో కమిషనర్‌కు వినతి అందజేశారు. యూనియన్ సభ్యులు ఎ.జగన్మోహ్రన్రావు, నాయకులు మురళి పాల్గొన్నారు.

జిల్లాలో కెవికె ఏర్పాటు : ఎమ్‌పి

ప్రజాశక్తి-విజయనగరంకోట

జిల్లాలో కృషి విజ్ఞాన్ కేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు విజయనగరం ఎమ్‌పి కలిశెట్టి అప్పలనాయుడు తెలిపారు. సోమవారం అశోక్ బంగ్లా టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా రైతులు అభివృద్ధి, సంక్షేమం కోసం కృషి విజ్ఞాన కేంద్రం ఏర్పాటుకు సహకరించిన ప్రధాని మోడి, సిఎం చంద్రబాబుకు రైతుల తరపున ధన్యవాదాలు తెలిపారు. కృషి విజ్ఞాన కేంద్రం కోసం 50ఎకరాల స్థలాన్ని కేటాయిస్తూ, 15 మంది శాస్త్రవేత్తలను నియమించారని తెలిపారు. ఈ కేంద్రం ద్వారా జిల్లా రైతులకు విలువైన సేవలు సకాలంలో అందనున్నాయన్నారు. రైతులకు ఎరువులు, విత్తనాలు సకాలంలో సరఫరా చేస్తున్నప్పటికి, వైసిపి నాయకులు దుష్ప్రచారం చేస్తున్నారని అన్నారు. ఇటీవలపార్లమెంటు సమావేశాల్లో జిల్లాలో పలు రైల్వే, రహదారులు అభివృద్ధి పనులపై చర్చించినట్లు తెలిపారు. సమావేశంలో టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, నగర అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీప్రసాద్, ఆర్గనైజింగ్ సెక్రటరీ బంగారుబాబు, టిఎన్ఎస్ఎఫ్ ప్రధానకార్యదర్శి సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

28, 29న డిఎస్‌సి అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

డిఎస్‌సిలో ఎంపికైన అభ్యర్థులు సర్టిఫికెట్లను ఈ నెల 28, 29వ తేదీల్లో పరిశీలించనున్నట్లు డిఇఒ మాణిక్యంనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. మోదవలస వద్దనున్న ఓయిస్టర్ ఇంటర్నేషనల్ స్కూల్లో సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుందని చెప్పారు. అన్ని సర్టిఫికెట్లతో హాజరుకావాలని సూచించారు.

ఫిర్యాదుదారులకు న్యాయం చేస్తాం : ఎస్‌పి

కంటోన్మెంట్ : ఫిర్యాదుదారులకు న్యాయం చేసేందుకు చర్యలు తీసుకుంటామని ఎస్‌పి వకుల్‌జిందల్ తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలోసోమవారం ప్రజల నుండి 36 ఫిర్యాదులను స్వీకరించారు. వీటిలో భూతగాదాలకు సంబంధించినవి 11, కుటుంబ కలహాలకు సంబంధించినవి 8, మోసాలకు పాల్పడినట్లు 5,ఇతర అంశాలకు సంబంధించినవి 12 ఫిర్యాదులు ఉన్నాయన్నారు. వీటి పూర్వాపరాలను విచారణ చేసి, ఫిర్యాదు అంశాలు వాస్తవమైనట్లయితే చట్ట పరిధిలో చర్యలు చేపట్టాలని సంబంధిత పోలీసు అధికారులను ఎస్‌పి ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, ఎస్‌బి సిఐ ఎ.వి.లీలారావు, డిసిఆర్‌బి సిఐ బి.సుధాకర్, ఎస్ఐ రాజేష్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ

స్మార్ట్ రేషన్ కార్డు అందజేస్తున్న కలెక్టర్ బిఆర్ అంబేద్కర్

ప్రజాశక్తి-కంటోన్మెంట్

జిల్లాలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి సోమవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ శ్రీకారం చుట్టారు. స్థానిక కెఎల్‌పురం లోని 70వ రేషన్ డిపో పరిధిలోని లబ్దిదారుల ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేశారు. మొదటిగా లబ్దిదారులు మజ్జి సావిత్రమ్మ, రావాడ పద్మల ఇళ్లకు వెళ్లి, కలెక్టర్ అంబేద్కర్, జెసి ఎస్.సేతు మాధవన్ స్మార్టు కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ లబ్దిదారులకు ఉపయోగపడేవిధంగా కొత్తగా స్మార్ట్ రేషన్ కార్డులను ప్రభుత్వం అందజేస్తోందని చెప్పారు. ఈ కార్డులో ఆ కుటుంబ సభ్యుల వివరాలన్నీ క్రోడీకరించి ఉంటాయని, రేషన్ డిపోల్లో వద్ద స్కాన్ చేసిన వెంటనే వివరాలన్నీ తెలుస్తాయని అన్నారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 5,73,137 కార్డులను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. వృద్ధులు, దివ్యాంగులకు ఇంటివద్దకే రేషన్ సరుకులను పంపిణీ చేస్తున్నామని చెప్పారు. ఈ అవకాశాన్ని లబ్దిదారులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. కార్యక్రమంలో డిఎస్ఒ జి.మురళీనాథ్, తాహశీల్దార్ కూర్మనాథరావు, కార్పొరేటర్ తాళ్లపూడి సంతోషి, రేషన్ డీలర్ మామిడి సూర్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ, పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల దీర్ఘకాలిక పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఆలిండియా పెన్షనర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. అసోసియేషన్ నాయకులు వి.శేషగిరి, సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు, ఎ.గౌరినాయుడు మాట్లాడుతూ 2018 జులై 1 నుంచి పెండింగ్‌లో ఉన్న డిఎ, పిఎఫ్, ఎపిజిఎల్ఐ, ఆర్జిత సెలవుల నగదు, పిఆర్‌సి బకాయిలు రూ.20 వేల కోట్లకు పైనే ఉన్నాయని, వెంటనే వాటిని చెల్లించాలని డిమాండ్ చేశారు. 12వ పిఆర్‌సి కమిషనర్‌ను నియమించి మధ్యంతర భృతి ఇవ్వాలని కోరారు. ధర్నాలో ఒఎస్ఎన్ మూర్తి, పైడినాయుడు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ అథ్లెటిక్స్‌లో సత్తా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

తిరుపతిలో జరిగిన జాతీయ క్రీడా దినోత్సవ రాష్ట్రస్థాయి పోటీల్లో విజయనగరం జిల్లా అథ్లెట్లు రెండు బంగారు, రెండు రజిత, ఒక కాంస్య పతకం సాధించారు. పతకాలు సాధించిన అథ్లెట్స్‌ను డిఎస్‌డిఒ శ్రీధర్, జిల్లా అథ్లెటిక్ సంఘ సభ్యులు లీలాకృష్ణ శ్రీకాంత్ అభినందించారు. పథకాలు సాధించినవారిలో పి. వసంత, ఎస్. దివ్యవాణి (100 మీటర్లు), ఎస్. శ్రావణి (800 మీటర్లు), బి.నీలిమా,పి.పవన్ కల్యాణ్ (లాంగ్‌జంప్) ఉన్నారు.

మడ్డువలస గేటు ఎత్తివేత

ప్రజాశక్తి - వంగర

మండలంలోని మడ్డువలస ప్రాజెక్టుకు సువర్ణముఖి, వేగావతి నదుల నుంచి 2122 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. పూర్తిస్థాయి నీటిమట్టం 65 మీటర్లకు గాను ప్రస్తుతం 64.52 మీటర్లకు చేరింది. దీంతో సోమవారం ఒక గేటు ఎత్తి 2123 క్యూసెక్కుల నీటిని దిగువకు విడిచిపెట్టినట్లు ప్రాజెక్టు ఎఇ కె.నితిన్ కుమార్ తెలిపారు. కుడి ,ఎడమ కాలువల ద్వారా మరో 510 క్యూసెక్కుల నీరు ఆయకట్టుకు వెళ్తోంది.

ప్రాజెక్టు గేటు ఎత్తడంతో దిగువకు వెళ్తున్న నీరు

ఫెన్సింగ్ జట్ల ఎంపిక

విజయనగరం టౌన్ : స్థానిక విజ్జీ స్టేడియంలో అండర్ 17 (క్యాడెట్) 11వ రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలకు ఉమ్మడి విజయనగరం జిల్లా ఫెన్సింగ్ క్రీడాకారులకు సైబర్, ఇప్పి, ఫాయిల్ విభాగాల్లో ఎంపిక జరిగింది. ఎంపికైన వారు ఈనెల 30న పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో జరుగు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారు. ఈ సెలక్షన్‌లో ఎం.బాలరాజు, అనిల్ కుమార్, అప్పలరాజు రిఫరల్ గా వ్యవహరించారు.

ప్రతినెలా మూడో శుక్రవారం ఉద్యోగి గ్రీవెన్స్

కంటోన్మెంట్ : ప్రతినెలా 3వ శుక్రవారం ఉద్యోగుల కోసం ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించనున్నట్లు కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంప్లాయిస్ గ్రీవెన్స్ సెప్టెంబరు 19న కలెక్టరేట్‌లో జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొంటారని తెలిపారు. ఉద్యోగులు తమ సమస్యలపై దరఖాస్తులను అందజేయవచ్చునని సూచించారు.

గిరిజన పరిశోధన కోసం ఐదు సిటియుల మధ్య ఒప్పందం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కేంద్ర గిరిజన విశ్వవిద్యాలయం గిరిజన పరిశోధన కోసం ఐదు ఒప్పందాలు చేసుకుంది. ఒడిశా రాష్ట్రంలోని కొరాపుట్ లోని కేంద్ర విశ్వవిద్యాలయం, ఒడిశా లో ఐదు కేంద్ర విశ్వవిద్యాలయాల మధ్య గిరిజన అధ్యయనాలు, పరిశోధనను బలోపేతం చేయడానికి : కేంద్ర విశ్వవిద్యాలయం, ఒడిశా కేంద్ర గిరిజన విశ్వవిద్యాలయం, ఆంధ్రప్రదేశ్ లో విజయనగరం సిటియు, అమర కాంటాక్ ఇంగ్లీష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్శిటీ, హైదరాబాద్ సమక్క సరక్క గిరిజన విశ్వవిద్యాలయం మధ్య ఒప్పందం కుదిరింది. గిరిజన పరిశోధనలో అంతరశాఖల దక్పథాన్ని ప్రోత్సహించడమే కాకుండా, విశ్వవిద్యాలయాల మధ్య సహకార విద్యా కార్యక్రమాలను బలోపేతం చేస్తుంది. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అధికారులు, బోధనా సిబ్బంది పాల్గొన్నారు. ప్రొఫెసర్ ఎన్.నాగరాజు, ఉపకులపతి ప్రొఫెసర్ టి.శ్రీనివాసన్, ప్రొఫెసర్ సౌభాగ్య రంజన్ పాఢీ, ఉపకులపతి ప్రొఫెసర్ వై. ఎల్. శ్రీనివాస్, ఉపకులపతి ప్రొఫెసర్ నరసింహ చరణ్ పాండా పాల్గొన్నారు.

నాగరాజుకు మూడు టీచర్ పోస్టులు

ప్రజాశక్తి-పార్వతీపురం

మెగా డిఎస్‌సి ఫలితాల్లో బలిజిపేట మండలం పెదపెంకి గ్రామానికి చెందిన సారిపల్లి నాగరాజు ఏకంగా మూడు టీచర్ పోస్టులను కైవసం చేసుకున్నారు. నాగరాజు తల్లిదండ్రులు లక్ష్మీ, జనార్దనరావు వ్యవసాయం చేస్తున్నారు. రైతు కుటుంబానికి చెందిన నాగరాజు ఎంఎ తెలుగు, ఎం.ఫిల్ తెలుగు హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో పూర్తి చేసి పట్టా పొందారు. ప్రస్తుతం అదే విశ్వవిద్యాలయంలో పిహెచ్‌డి చేస్తున్నారు. డిఎస్‌సి ఫలితాల్లో స్కూల్ అసిస్టెంట్ తెలుగు విజయనగరం జిల్లా రెండవ ర్యాంకు, పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్ (జోన్ 1) లో మూడో ర్యాంకు, టిజిటిలో ఆరోర్యాంకు సాధించారు. అయితే తెలుగు స్కూల్ అసిస్టెంట్ పోస్టులో చేరుతానని ఈ సందర్భంగా నాగరాజు తెలిపారు.

సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి పదవికి రాజీనామా

ప్రజాశక్తి-విజయనగరంకోట

ఆంధ్రప్రదేశ్ సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి పదవికి రాజీనామా చేస్తున్నట్లు సుంకరి సూర్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. 2023లో రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైన తాను సీనియర్ సిటిజన్ల కోసం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. వ్యక్తిగత కారణాల వల్ల రాష్ట్ర కార్యదర్శి పదవికి, జిల్లా సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు.

ఎమ్మెల్యే కళా సోదరుడు మృతి

ప్రజాశక్తి- రేగిడి

చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళా వెంకట్రావు, మాజీ ఎమ్మెల్యే కిమిడి గణపతిరావు సోదరుడు కిమిడి నీలంనాయుడు(71) సోమవారం ఉదయం అనారోగ్యంతో మండల కేంద్రంలో మృతి చెందారు. ఈయన రేగిడి సర్పంచ్‌గా పనిచేసి గ్రామాభివృద్ధికి ఎనలేని సేవలు అందజేశారు. కీర్తిశేషులు కిమిడి సూరపునాయుడు దంపతులకు ఏడుగురు మగ సంతానంలో నీలంనాయుడు పెద్దవాడు. ఇటీవల తన సోదరుడు కిమిడి సత్యనారాయణ నాయుడు మృతి మరవక ముందే నీలంనాయుడు మృతి చెందడం ఆ కుటుంబంలో విషాదఛాయలు అలమకున్నాయి. ఈయన మృతితో పలువురు సంతాపం వ్యక్తం చేస్తూ ఆ కుటుంబానికి సానుభూతి వ్యక్తం చేశారు.

తపాలా బీమా ఏజెంట్లకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగరం డివిజన్ తపాలా శాఖ పరిధిలో తపాలా జీవిత భీమా, గ్రామీణ తపాలా జీవిత భీమా ఏజెంట్లుగా పని చేసేందుకు దరఖాస్తులు కోరుతున్నట్లు పోస్టల్ సూపరింటెండెంట్ కొల్లూరు శ్రీనివాస్ తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీసు విజయనగరం వారి కార్యాలయంలో (హెడ్‌పోస్టాఫీస్ మేడపై) ఈనెల 26 నుంచి 29 వరకు తమ బయో డేటా, ఫోటో, ఒరిజినల్ సర్టిఫికెట్స్, జెరాక్సు కాపీలతో పాటు హాజరు కావాలని కోరారు. ఏజెంట్లు వారు చేసిన పాలసీల ననుసరించి కమీషను ఇస్తారని తెలిపారు. 5వేలకు తక్కువగా ఉన్న జనాభా ప్రాంతాల్లో 10 వ తరగతి, 5000 ఆ పైన జనాభా గల ప్రాంతాల్లో 12వ తరగతి ఉత్తీర్ణులు అయి ఉండాలని తెలిపారు. 18నుంచి 60ఏళ్ల లోపు వారు అర్హులని తెలిపారు.

పేదలకు అండగా సిఎం సహాయనిధి

ప్రజాశక్తి-బొబ్బిలి

పేదలకు సిఎం సహాయ నిధి అండగా ఉంటుందని ఎమ్మెల్యే బేబినాయన అన్నారు. స్థానిక కోటలో సోమవారం తెర్లాం మండలం మోదుగువలసకు చెందిన జి.సత్యానికి రూ.2,76,953, బొబ్బిలి పట్టణానికి చెందిన కె.గాయత్రీకి రూ.1,58,400 చెక్కులను అందజేశారు. ఆయన మాట్లాడుతూ పేదలకు పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం తరుపున సహాయం చేయడం ఎంతో ఆనందంగా ఉందని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ శరత్ పాల్గొన్నారు.

అన్నదాత సుఖీభవ అందేలా చూడండి

ప్రజాశక్తి- పూసపాటిరేగ

మండలంలోని భరణికం గ్రామానికి చెందిన పలువురు రైతులకు అన్నదాత సుఖీభవ నిధులు పడలేదని టిడిపి మండల పార్టీ అధ్యక్షులు మహంతి శంకరరావు ఆధ్వర్యంలో సోమవారం తహశీల్దార్ ఎన్‌వి రమణను కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు పెట్టుబడి సాయంగా అందిస్తున్న అన్నదాత సుఖీభవ పథకం నిధులు కొంతమంది రైతులకు జమ అవ్వలేదని అర్హత ఉన్న వారందరికీ వచ్చేలా చూడాలని కోరారు. డబ్బులు పడని రైతులను వెంటనే గుర్తించి, వారికి నిధులు అందేలా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. టిడిపి మండల కోశాధికారి ఐ.టీవీ శ్రీనివాసరావు, టిఎంటియుసి అధ్యక్షులు విక్రమ్ జగన్నాథం, యువ నాయకులు ఆకిరి జగదీశ్వరరావు, చందక ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

బల్లంకికి 15 బోర్లు మంజూరు

వేపాడ : మండలంలోని బల్లంకి గ్రామానికి విశాఖ డెయిరీ నుంచి 15 బోర్లు మంజూరయ్యాయి. ఈ మేరకు బల్లంకిలో కొత్తగా ఏర్పాటుచేసిన బోరును సోమవారం ప్రారంభించారు. ఒక్కొక్క బోరుకు రూ.1.50 లక్షలని, ఇందులో రైతు వాటా రూ.50 వేలు, డెయిరీ, పాల ఉత్పత్తిదారుల సంఘం నుంచి చెరో రూ.50 వేలు చొప్పున ఉంటుందని సూపర్‌వైజర్ నాయుడు తెలిపారు. రూ.22.50 లక్షలు మంజూరైనట్లు విశాఖ డెయిరీ డైరెక్టర్ కోళ్ల కాటమయ్య తెలిపారు. ఎంపిటిసి గొంప తులసి, వైస్ సర్పంచ్ పల్లెధనుంజయ పాల్గొన్నారు.

సమీరకు ఎంబిబిఎస్ సీటు

నెల్లిమర్ల : కొండగుంపాం గ్రామానికి చెందిన పతివాడ సమీర ఎంబిబిఎస్ కన్వీనర్ కోటాలో సీటు సాధించింది. ఇటీవల ప్రకటించిన నీట్‌లో స్టేట్ ర్యాంకు 2020 కైవసం చేసుకున్న సమీరకు గుంటూరులోని కాటూరి వైద్య కళాశాలలో సీటు లభించింది. సమీర తండ్రి పతివాడ త్రినాథ్ ఇదే మండలంలోని కుదిపి ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ఆయన యూటిఎఫ్ జిల్లా కార్యదర్శిగా కూడా ఉన్నారు.

వివిఆర్ పేటను మన్యంలో విలీనం చేయాలి

ప్రజాశక్తి - వంగర

మండలంలోని వివిఆర్‌పేట పంచాయతీని పార్వతీపురం మన్యం జిల్లా గరుగుబిల్లి మండలంలో విలీనం చేయాలని కోరుతూ వివిఆర్‌పేట, జెకె గుమ్మడ గ్రామస్తులు కలెక్టర్ అంబేద్కర్‌కు, పార్వతీపురం మన్యం జిల్లాల కలెక్టర్ శ్యామ్ ప్రసాద్‌కు సోమవారం వినతి పత్రాలు అందజేశారు. తమ గ్రామం విజయ నగరానికి 120 కిలోమీటర్ల దూరంలో వంగర మండల కేంద్రానికి 17 కిలోమీటర్ల దూరంలో ఉండటం, రవాణా సౌకర్యంలేక పోవడంతో ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. తమ గ్రామానికి 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న పార్వతీపురం మన్యం జిల్లాలో తమ గ్రామాన్ని విలీనం చేయాలని, ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న గరుగుబిల్లి మండలంలో తమ పంచాయతీని కలపాలని కోరారు.

వావిలపాడులో పశు వైద్య శిబిరం

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని వావిలపాడులో సోమవారం పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని పశుసంవర్ధక శాఖ ఎడి చలపతిరావు సందర్శించారు. పశువుల్లో వచ్చే పునరుత్పత్తి సమస్యల వల్ల అధిక శాతం ఏడాదికి ఒక దూడ పొందలేక రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారని ఆయన వివరించారు. పాడి పశువులకు ఇచ్చే ఆహారంలో అన్ని రకాల పోషక పదార్థాలు ఉండాలన్నారు. ఖనిజ, లవణ మిశ్రమాన్ని తగినంతగా ఇచ్చినప్పుడే సాధారణ సమస్యలు తగ్గుతాయని చెప్పారు.

పశువైద్య శిబిరాన్ని సందర్శిస్తున్న ఎడి చలపతిరావు

అర్హులందరికీ స్మార్ట్ రేషన్ కార్డులు

బొబ్బిలిలో స్మార్ట్‌రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బేబినాయన

లక్కవరపుకోటలో కొత్త స్మార్ట్ కార్డులు పంపిణీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి

ప్రజాశక్తి-బొబ్బిలి

అర్హులందరికీ కూటమి ప్రభుత్వం రేషన్ కార్డులు మంజూరు చేస్తుందని ఎమ్మెల్యే బేబినాయన అన్నారు. స్థానిక శ్రీకళాభారతి ఆడిటోరియంలో సోమవారం స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. బొబ్బిలి పట్టణం, మండలంలో 35,285, బాడంగి మండలంలో 14,420, తెర్లాం మండలంలో 18,233, రామభద్రపురం మండలంలో 15,020 స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేయనున్నట్లు ఆయన చెప్పారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఎం.శ్రీను, మున్సిపల్ చైర్మన్ రాంబార్కి శరత్, గ్రంథాలయ పరిషత్ చైర్మన్ రౌతు రామమూర్తి, కౌన్సిలర్లు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

డెంకాడ :ప్రభుత్వం కొత్తగా మంజూరు చేసిన స్మార్ట్ రేషన్ కార్డులను డెంకాడలో ఎమ్మెల్యే లోకం నాగ మాధవి పంపిణీ చేశారు కార్యక్రమంలో ఎంపిపి బంటుపల్లి వెంకట వాసుదేవరావు, సర్పంచ్ పతివాడ గౌరీ, ఎంపిటిసి లక్ష్మి, తహశీల్దార్ రాజారావు, ఎంపిడిఒ వై.భవాని పాల్గొన్నారు.

వంగర: మండలంలోని అరసాడ, శివ్వాం, వంగర, మద్దివలసలో స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు. అరసాడలో ఎఎంసి వైస్ చైర్మన్ లచ్చుబుక్త ధనలక్ష్మి, కృష్ణమూర్తి, వంగరలో టిడిపి నాయకులు బొత్స వాసుదేవరావు నాయుడు, శివ్వాంలో ఉదయాన మురళీ కృష్ణారావు, మద్దివలసలో వై.ఉమామహేశ్వరరావు కార్డులను పంపిణీ చేశారు.

డెంకాడలో స్మార్ట్‌కార్డులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మాధవి

నెల్లిమర్ల: సారిపల్లిలో ఇంటింటికి వెళ్లి స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రాయి పైడమ్మ, మాజీ సర్పంచ్ పి వెంకట్రావు, మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు ఎస్ బాబురావు, డీలర్లు రమేష్, రమణబాబు పాల్గొన్నారు.

వేపాడ : మండలంలోని బానాదిలో ఎంపిటిసి గొంప తులసి స్మార్ట్‌కార్డులను పంపిణీ చేశారు.

విగ్రహాలుపంపిణీ చేస్తున్న ఎంపి, మార్క్‌ఫెడ్‌చైర్మన్

మట్టి విగ్రహాలు పంపిణీ

ప్రజాశక్తి-నెల్లిమర్ల

రామతీర్థం సేవా సంఘం ఆధ్వర్యంలో రామతీర్థం కూడలిలో ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు, రాష్ట్ర మార్కెఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు, టిడిపి రాష్ట్ర పరిశీలకులు సువ్వాడ రవిశేఖర్ మట్టి విగ్రహాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ, టిడిపి నాయకులు భాస్కర్ నాయుడు, గేదెల రాజారావు, ఆల్తి శ్రీనివాస్, రేగాన గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

డెంకాడ :భోగాపురంలో సోమవారం ఎమ్మెల్యే లోకం నాగమాధవి వినాయకుని మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. జనసేన నాయకులు పల్లంట్ల జగదీష్, పల్లా రాంబాబు, పడాల శ్రీను, వరుపుల సుధాకర్, సూరిబాబు, నవీన్, త్రినాథ్ పాల్గొన్నారు.

డిఎస్‌సి విజేతలకు మంత్రి కొండపల్లి అభినందనలు

ప్రజాశక్తి-గజపతినగరంరూరల్

మంత్రి కొండపల్లి శ్రీనివాస్ దత్తత గ్రామమైన గజపతినగరం మండలంలోని కెంగువ గ్రామంలో ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించిన ఆరుగురికి మంత్రి అభినందనలు తెలిపారు. ఇటీవల జరిగిన మెగా డీఎస్సీలో ఈ గ్రామానికి చెందిన మజ్జి భార్గవి జిల్లాలో మొదటి ర్యాంక్, మిత్తిరెడ్డి అప్పలనాయుడు నాలుగవ ర్యాంక్, కృష్ణవేణి 22వ ర్యాంకు, బండారు ఈశ్వరరావు 37వ ర్యాంకు, గుడివాడ సత్యారావు 115వ ర్యాంకు సౌభాగ్య లక్ష్మి 119వ ర్యాంకు లతో వివిధ విభాగాలలో ఉపాధ్యాయ ఉద్యోగాలకు అర్హత సాధించడం గొప్ప విషయమని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం మెగా డీఎస్సీ నిర్వహించి నిరుద్యోగ యువత జీవితాల్లో వెలుగులు నింపిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ కు మంత్రి ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. ఎంతో కష్టపడి చదివి వీరు డిఎస్‌సిలో ఉద్యోగాలు సాధించిన వీరు విద్యార్థులకు మంచి విద్యాబుద్ధులు నేర్పి వారి జీవితాలకు బంగారు బాటలు వేయాలని, భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఆశాభావం వ్యక్తం చేశారు.

కృష్ణదాసుకు సత్కారం

ప్రజాశక్తి-బొబ్బిలి

మండలంలోని అలజంగి సిబిఎం పాఠశాలలో సుదీర్ఘంగా 30ఏళ్ళపాటు ఉపాధ్యాయుడుగా పనిచేసిన కె.కృష్ణదాసు సీతానగరం మండలం బక్కుపేట ఎంపిపి పాఠశాలకు బదిలీ అయిన సందర్భంగా యుటిఎఫ్, గ్రీన్ బెల్ట్ సొసైటీ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. కృష్ణదాసు పిల్లలకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు సామాజిక కార్యక్రమాలు చేపట్టారని యుటిఎఫ్‌నాయకులు కె.విజయగౌరి, జెవివి నాయకులు ఎస్‌వి రమణమూర్తి, పి.సత్యంనాయుడు అన్నారు. కార్యక్రమంలో సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. కార్యక్రమంలో వెంకటనాయుడు, లక్ష్మణరావు, యుటిఎఫ్ నాయకులు ప్రసన్నకుమార్,శశిభూషణం, ఈశ్వరరావు, రమేష్ పాల్గొన్నారు.

సంక్షేమ హాస్టల్ అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి- డెంకాడ

నియోజకవర్గంలో ఉన్న సంక్షేమ హాస్టళ్ల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే లోకం నాగ మాధవి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయిలో వసతిగృహ సలహా సంఘం సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో ఉన్న బిసి, ఎస్‌సి, ఎస్‌టి వసతి గృహాల్లో సమస్యలు తన దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. నాలుగు మండలాల్లో ఉన్న హాస్టళ్ల పరిస్థితులను వసతి గృహ వార్డెన్లను అడిగి తెలుసుకున్నారు.

వసతి గృహ అధికారులపై ఎమ్మెల్యే ఆగ్రహం..

ప్రతి వసతి గృహంలో ట్యూటర్స్‌ను అధికారులు నియమించుకున్నారని ఎవరిని అడిగి నియమించారని ఎమ్మెల్యే వసతి గృహ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ట్యూటర్స్‌ను నియమించినప్పుడు ప్రజాప్రతినిధుల దృష్టికి రాకుండా నియమించడం మంచి పద్ధతి కాదన్నారు. ఈసారి అలా చేయకుండా ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువచ్చి నియమించాలని కోరారు. ఈ సమావేశంలో అసిస్టెంట బీసీ వెల్ఫేర్ అధికారి రాజులమ్మ, ఎంపిపి బంటుపల్లి వెంకట వాసుదేవరావు, ఎంపిడిఒ భవానీ పాల్గొన్నారు.

చీపురుపల్లి సబ్‌జైల్ ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి- చీపురుపల్లి

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఏ.కృష్ణప్రసాద్ స్థానిక సబ్ జైలును సోమవారం ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. కారాగారంలో ఉన్న ఖైదీలకు న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. వీరికి పలు చట్టాలపై అవగాహన కల్పించారు. ఖైదీల పట్ల సిబ్బంది వివక్షత చూపించరాదని చెప్పారు ఖైదీల పట్ల వివక్షత చూపిస్తే కఠినమైన చర్యలు ఉంటాయని, ఆ విషయమై జైలు సూపరింటెండెంట్‌ని వివరాలు అడిగి తెలుసుకున్నారు. సబ్ జైల్లో కొనసాగుతున్న జైల్ లీగల్ ఎయిడ్ క్లినిక్‌లను తనిఖీ చేశారు. అనంతరం కెజిబివిని ఆకస్మికంగా సందర్శించారు. అనంతరం పాఠశాలలో బాలికలకు బాల్య వివాహాలపై న్యాయ అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ అవగాహన సదస్సులో తహశీల్దార్ డి.ధర్మరాజు, ప్రిన్సిపల్ హైమావతి, సిఐ జి.శంకర్రావు, ఎస్‌ఐ దామోదర్ రావు పాల్గొన్నారు.

వినాయక మండపాలకు అనుమతి తప్పనిసరి

గజపతినగరంరూరల్ : వినాయక మండపాల ఏర్పాటుకు పోలీసుల అనుమతి తప్పనిసరని సిఐ జివి రమణ తెలిపారు. సోమవారం స్థానిక స్టేషన్ ఆవరణలో విలేకరులతో మాట్లాడారు. వినాయక ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించుకోవడానికి పోలీస్ శాఖకు ప్రజలంతా సహకరించాలని కోరారు. అశ్లీల నృత్యాలు, రికార్డింగ్ డాన్సులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో ఎస్‌ఐ కిరణ్‌కుమార్ నాయుడు పాల్గొన్నారు.

రేగిడి : మండలంలోని 39 గ్రామ పంచాయతీలో ఈ నెల 27 నుంచి జరగబోయే గణేష్ ఉత్సవాల మండపాలకు పోలీసులు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్‌ఐ నీలావతి తెలిపారు. ఈ మేరకు సోమవారం పోలీస్ స్టేషన్లో విలేకరులతో మాట్లాడుతూ గణేష్ మండపాలు ఏర్పాటు చేసిన నిర్వాహకులు యాప్ డౌన్‌లోడ్ చేసుకుని ఉచితంగా అనుమతులు పొందాలన్నారు. నిర్వాహకులు ముందుగా ఒక కమిటీగా ఏర్పడి, ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సింగిల్ విండో విధానంతో https://ganeshutsav.net క్లిక్ చేసి, నిర్ధేశించిన అనుమతులు పొందాలన్నారు.

ఎరువుల కొరత లేకుండా చూస్తాం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి- సంతకవిటి

రైతులకు ఎరువులు కొరత లేకుండా చూస్తామని ఎమ్మెల్యే కోండ్రు మురళి మోహన్ అన్నారు. సోమవారం సంతకవిటి పిఎసిఎస్ అధ్యక్షులు, డైరెక్టర్లు ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల ప్రాథమిక సహకార సంఘం బ్యాంక్ సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇప్పటికే రాష్ట్ర అభివృద్ధిలో కూటమి ప్రభుత్వం దూసుకుపోతుందన్నారు. మెగా డిఎస్‌సి, కానిస్టేబుల్ ఉద్యోగులు తీయడంతో నిరుద్యోగులు సంతోషంగా ఉన్నారన్నారు. స్త్రీ శక్తి, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ వంటి పథకాలు అమలు చేశామన్నారు. ఇప్పటికే 30కోట్లు నిధులతో ప్రస్తుతం మండలంలోని రహదారి పనులు చాలా చురుకుగ్గా జరిగాయని తెలిపారు. అనంతరం మండల సహకార సంఘం అధ్యక్షులుగా చెలికాని మహేష్ కుమార్ బాధ్యతలు చేపట్టారు. ఎమ్మెల్యే ఆయన్ను సత్కరించారు. ఎమ్మెల్యే సమక్షంలో పిఎసిఎస్ అధికారులు నూతన కమిటీతో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తూర్పు కాపు కార్పొరేషన్ మాజీ చైర్మన్ కొల్ల అప్పలనాయుడు, నియోజకవర్గం వాణిజ్య విభాగం అధ్యక్షులు వల్లూరు గణేష్, ఎస్సిసెల్ అధ్యక్షులు మన్నేన రమేష్, నియోజకవర్గం ఐటిడిపి అధ్యక్షులు భవిరి శ్రీనుబాబు, టిడిపి మండల అధ్యక్షులు గట్టి భాను, సమతం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగంపై బిజెపికి గౌరవం లేదు : ముప్వల

ప్రజాశక్తి-బొబ్బిలి

బిజెపికి భారత రాజ్యాంగంపై గౌరవం లేదని కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి ముప్వల శ్రీనివాసరావు అన్నారు. బొబ్బిలిలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'పార్లమెంటులో కొత్తగా మోడీ తీసుకొస్తున్న చట్టం ప్రకారం 30 రోజులు రిమాండ్‌లో ఉంటే వారి పదవిని కోల్పోతారట. నేర నిరూపణ అయ్యాక కాదు, కేవలం కేసు నమోదు చేస్తే చాలు. ఇది బిగ్ జోక్ ఆఫ్ ది ఇయర్' అని వ్యాఖ్యానించారు. అధికారం ఉంది కదా అని ఇష్టం వచ్చినట్లుగా చట్టాలు చేస్తే ప్రజలు ఊరుకోరని, సమయం వచ్చినప్పుడు ప్రజల శక్తి ఏమిటో చూపిస్తారని హెచ్చరించారు. కొత్త చట్టం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడానికి బిజెపి ఎత్తుగడలా కనిపిస్తుందని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో రాజ్యాంగాన్ని సంరక్షించుకోవాలని, కోరారు.

ఎరువుల దుకాణంలో ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-గజపతినగరం రూరల్

మండలంలోని రైతు సేవా కేంద్రాలు, శ్రీసత్య ట్రేడర్స్ ఎరువుల దుకాణంలో సోమవారం యూరియా పంపిణీ, నిల్వలను తహశీల్దార్ రత్నకుమార్, ఎస్‌ఐ కిరణ్ కుమార్ నాయుడు, ఎఒ కిరణ్ కుమార్ తనిఖీ చేశారు. ధరల పట్టిక, బిల్లులు తనిఖీ చేసినట్లు వారు తెలిపారు. రైతులకు యూరియా అమ్మకాలు చేసేటప్పుడు అనవసరమైన వాటిని ముడిపెట్టవద్దని ఆదేశించారు. ఎంఆర్‌పి కంటే అధిక ధరలకు అమ్మితే యూరియా నిల్వ మొత్తం స్వాధీనం చేసుకుని వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు పంపిణీ చేస్తామని హెచ్చరించారు.

నెల్లిమర్ల : స్థానిక మన గ్రోమోర్, శ్రీనివాస ట్రేడర్స్ ఎరువులు షాప్‌లను వ్యవసాయ, విజిలెన్స్ ఎన్ ఫోర్స్‌మెంట్ అధికార్లు సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎడిఎ ఎన్.కోటేశ్వరరావు, విజిలెన్స్ ఎన్ ఫోర్స్ మెంట్ ఎజి ఎం. సురేష్ కుమార్ మాట్లాడుతూ డీలర్లు విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు నాణ్యతతో కూడినవి ఇవ్వాలని సూచించారు. అధిక రేట్లకు అమ్మడం, బ్లాక్ చేయడం, వంటివి చేయరాదని కొనుగోలు చేసిన ప్రతీ రైతుకు రసీదు ఇవ్వాలని, స్టాక్ రికార్డులు నిర్వహించాలని, నిబంధనలు అతిక్రమిస్తే వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీలో ఎఒ పి.శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

నేత్రదానంపై అవగాహన ర్యాలీ

కొత్తవలస : జాతీయ నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా సోమవారం వియ్యంపేటలో వైద్యాధికారి గోపాలకృష్ణ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది, ఎఎన్‌ఎంలు,ఆశావర్కర్లు అవగాహన ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో ఆప్తాల్మిక్ ఆఫీసర్ సి.హెచ్.ఈశ్వరరావు, వైద్య సిబ్బంది వి.పద్మావతి, ఈశ్వరరావు, ఆశాజ్యోతి, సత్యారావు, పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎస్‌ఐ బి.గణేష్ సూచించారు. సోమవారం ఆయన సంకల్పంలో భాగంగా సతివాడ జెటిఎన్‌ఎం కళాశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తమ తల్లిదండ్రులు ఆశయాలకు అనుగుణంగా చదువు మీద దృష్టి పెట్టి మంచి వ్యక్తులుగా గుర్తింపు సాధించాలన్నారు. ప్రస్తుత సమాజాన్ని పట్టిపీడిస్తున్న గంజాయి, డ్రగ్స్ తదితర వ్యసనాలకు ఎట్టి పరిస్థితుల్లోనూ లోను కాకూడదని చెప్పారు అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడిన వెంటనే 9121109444 నెంబర్‌కి ఫోను, మెసేజ్ ద్వారా తెలియజేయాలని కోరారు.

పట్టాలపై గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

ప్రజాశక్తి-కంటోన్మెంట్

కొత్తవలస-కంటకాపల్లి రైల్వే స్టేషను సమీపాన ట్రాక్‌పై గుర్తుతెలియని పురుషుని మృతదేహం సోమవారం లభ్యమైందని విజయనగరం రైల్వే ఎస్‌ఐ వి.బాలాజీ రావు తెలిపారు. ఛామనచాయ రంగు చాయ రంగు కలిగి ఉండి, ఎరుపు రంగు గల ఫుల్ హ్యాండ్ టీ షర్టు , నీలం రంగు గల షార్ట్ ధరించి ఉన్నాడని తెలిపారు. ఆచూకీ లభిస్తే విజయనగరం రైల్వే పోలీస్ స్టేషన్ ఫోన్ నెంబర్లు 9490617089,6301365605 నెంబర్లను సంప్రదించాలని తెలిపారు

నేత్రదానం మహాదానం : డిఎంహెచ్ఒ

40వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి-కంటోన్మెంట్

నేత్రదానం అన్ని దానాల్లోకి గొప్పదని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారిణి డాక్టర్ ఎస్.జీవనరాణి పేర్కొన్నారు. 40 జాతీయ నేత్రదాన పక్షోత్సవాలను స్థానిక డిఎంఅండ్‌హెచ్ఒ కార్యాలయంలో సోమవారం ప్రారంభించారు. ఈసందర్భంగా అవగాహనా సదస్సును, ర్యాలీని నిర్వహించారు. ప్రశంసా పత్రాలను, కరపత్రాలను, గోడ పత్రికలను ఆవిష్కరించారు. జిల్లా అంధత్వ నివారణా కార్యక్రమం ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కె.త్రినాథ్ మాట్లాడుతూ, నేత్ర దానం ప్రాధాన్యతను వివరించారు. ఒక వ్యక్తి కార్నియాతో ఇద్దరు అంధులకు చూపును ప్రసాదించవచ్చునని చెప్పారు. కళ్లను దానం చేయడం ద్వారా తాము చనిపోయినా, తమ చూపు మాత్రం సజీవంగా ఉంటుందని అన్నారు. రెండేళ్లు పైబడి 80 ఏళ్ల వరకు ఎవరైనా నేత్రదానం చేయవచ్చునని సూచించారు. ఏడాదికి 25వేల కార్నియాలు అవసరం కాగా, ప్రస్తుతం 5వేలు మాత్రమే లభిస్తున్నాయని, కార్నియాలు దొరకక ఎంతోమంది అంధత్వంతో బతుకుతున్నారని తెలిపారు. నేత్రదానం చేయడానికి అంగీకరించిన వ్యక్తి చనిపోయిన 6 గంటల్లో తెలియజేయాలని, కళ్లపై తడి దూదిని ఉంచాలని, తల కింద ఎత్తుగా తలగడ ఉంచి నిపుణులకు సమాచారం ఇవ్వాలని డాక్టర్ త్రినాథ్ తెలిపారు. నేత్రదానానికి ముందుకు వచ్చే వ్యక్తులు రెడ్‌క్రాస్ నెంబర్ 9014327168 గానీ లేదా 9440821919, 9246624000 సూచించారు. కార్యక్రమంలో డిఎల్ఒ డాక్టర్ కె.రాణి, పుష్పగిరి వైద్యులు డాక్టర్ డివిఎన్ మురళి, ఇతర వైద్యాధికారులు, ప్రోగ్రాం ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్ పనుల పరిశీలన

ప్రజాశక్తి-కొత్తవలస

కొత్తవలస పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న అన్న క్యాంటీన్ భవన నిర్మాణ పనులను సోమవారం ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి పరిశీలించారు. భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టరుకు ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో దాసరి కార్పొరేషన్ చైర్మన్ పొట్నూరు వెంకట రత్నాజీ, పిఎసిఎస్ చైర్మన్ కోళ్ల వెంకటరమణ, టిడిపి మండల అధ్యక్షులు గొరపల్లి రాము, ప్రధాన కార్యదర్శి కనకాల శివ, నాయకులు బొబ్బిలి అప్పారావు, బంగారం రమేష్, లెంక శ్రీను, సర్పంచ్ మచ్చ ఎర్రయ్య రామస్వామి పాల్గొన్నారు.

రోడ్డు సదుపాయం కల్పించాలని ధర్నా

ప్రజాశక్తి- మెంటాడ

మండలంలో గిరిజన గ్రామాలకు రోడ్ల సదుపాయం కల్పించాలని, తాగునీటి సమస్యను పరిష్కరించాలని సోమవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయం ఎదుట కెవిపిఎస్ జిల్లా నాయకులు రాకోటి రాములు ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన గ్రామాలకు రోడ్డు సదుపాయం లేక అనారోగ్యం పాలైన రోగులను డోలీలు కట్టి మైదాన ప్రాంతాలకు తీసుకువచ్చి చికిత్సలు చేయించాల్సి వస్తోందన్నారు. కొండలింగాల వలస నుంచి పాతపాడు, ఆంద్ర నుంచి పనసలవలస, కొండ జీరికవలస, కుంభీ వలస, కోటపర్తి, మెంటాడ నుంచి సారాడవలస, మల్లెడవలస, సంఘం గుడ్డి వలస, కింద గూడెం, పనుకు వాని వలస గ్రామాలకు రహదారి నిర్మించాలన్నారు. లోతుగడ్డ నుంచి భాషలపాడు, జీరికవలస, కొండపర్తి గ్రామాలకు రహదారి, గరుగుబిల్లి పంచాయతీ వద్ద కాజ్‌వే నిర్మాణం పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. గుర్ల, వానిజ గ్రామాలకు శ్మశానవాటికలకు సిసి రోడ్డు సదుపాయం కల్పించాలన్నారు. అనంతరం ఎంపిడిఒ ఎ.భానుమూర్తికి వినతి అందజేశారు. కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం నాయకులు తామరపల్లి సోములు, తామరపల్లి గంగమ్మ , డోలే రాము, పోసూరు రాముల అప్పలస్వామి, బుచ్చి దొర తదితరులు పాల్గొన్నారు.

కాలువల్లో వ్యర్థాలు వేస్తే జరిమానా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కాలువల్లో వ్యర్థాలను పారబోసినట్లయితే తక్షణమే అపరాధ రుసుము విధిస్తామని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య తెలిపారు. మురికినీటి ప్రవాహానికి అడ్డంకి కలిగించే చర్యలను సహించబోమని స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన ఆదేశాలతో రింగ్ రోడ్డులోని కాలువల పరిస్థితులను ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి పరిశీలించారు. ప్రధాన కాలువలో కోళ్ల దుకాణం వ్యర్థాలు పడి ఉండడానికి గమనించి అందుకు సంబంధించిన దుకాణ యజమానిని పిలిచి మందలించారు. ఇకనుండి ఇటువంటి చర్యలు చేపట్టినట్లయితే భారీగా అపరాధ రుసుము విధిస్తారన్నారు.

ఫిట్నెస్‌పై అవగాహన పెంచుకోవాలి

ప్రజాశక్తి - గరివిడి

మండలంలోని అన్ని పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులకు, విద్యార్థులకు స్వీయ రక్షణ అనే అంశంపై గరివిడి ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు యం. నిర్మల అధ్యక్షతన విద్యాశాఖ, పోలీసు శాఖ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ముఖ్య అతిధులుగా మండల విద్యాశాఖ అధికారులు పి.రామారావు, డి.అప్పన్న, ఎస్‌ఐ లోకేశ్వరరావు పాల్గొని మాట్లాడారు. మహిళల రక్షణ, విద్యార్థుల స్వీయ రక్షణకు కరాటే, క్రీడలు, ఇతర అంశాలపై సూచనలు సలహాలు అందించారు.

యూరియా సమస్యపై తహశీల్దార్ ఆరా

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని సోమరాజుపేట రైతుసేవా కేంద్రాన్ని సోమవారం తహశీల్దార్ ఐ.కృష్ణలత పరిశీలించారు. యూరియా సమస్య ఎక్కువగా ఉందని తహశీల్దార్‌కు రైతులు వివరించారు. ఖరీఫ్ వ్యవసాయానికి యూరియా లేకపోతే పంటలు పండించ లేమని రైతులు మొరపెట్టుకున్నారు.యూరియాపై ఎఒ శ్రీనివాసరావును అడిగి తెలుసుకున్నారు. మరో రెండు రోజుల్లో వస్తాయని చెప్పారు. తహశీల్దార్‌తో ఆర్‌ఐ కిరణ్ కుమార్ ఉన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

ప్రజాశక్తి - గజపతినగరం

సదస్సులో మాట్లాడుతున్న సివిల్ జడ్జి విజయ్‌రాజ్‌కుమార్

ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని స్థానిక కోర్టు సివిల్‌జడ్జి విజయ్ రాజ్ కుమార్ అన్నారు. న్యాయ సేవ అధికార సంస్థ అందిస్తున్న ఉచిత సేవలను వినియోగించుకోవాలని సూచించారు. సోమవారం ఓలం కంపెనీలో రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆదేశాల మేరకు జరిగిన న్యాయ అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. విద్యతో సంబంధం లేకుండా అందరికీ చట్టాలపై అవగాహన ఉండాలని, బాల్య వివాహాలు చేస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన స్పష్టం చేశారు. చట్టపరంగా మహిళలకు సమాన హక్కులు ఉన్నాయని, వీటిపై ప్రతి ఒక్కరూ అవగాహన చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గజపతినగరం ఎస్‌ఐ కిరణ్ కుమార్ నాయుడు పాల్గొన్నారు.

చెరువులో మునిగి వ్యక్తి మృతి

ప్రజాశక్తి-గంట్యాడ

మండలంలోని మదనాపురం గ్రామంలో లగుడు సురేష్ (40) సోమవారం చెరువులోకి దిగి పువ్వులు తెంపుతుండగా నీటిలో మునిగి మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. రానున్న వినాయక చవితి పండగ సందర్భంగా కలువ పువ్వులను కోసి అమ్ముకుందామని ఉద్దేశంతో అదే గ్రామానికి చెందిన ముని అక్కమ్మ కోనేరులో సురేష్ దిగాడు. కలువ పువ్వులను కోస్తున్న సమయంలో లోతు ఎక్కువగా ఉన్న ప్రాంతంలో చిక్కుకుని, మునిగిపోయాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం విజయనగరంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సురేష్‌కు భార్య గంగమ్మ, కుమార్తె అమృత ఉన్నారు. గంగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సాయికృష్ణ తెలిపారు.

చోరీ కేసులో నిందితులు అరెస్టు

ప్రజాశక్తి - గజపతినగరం రూరల్

ఇటీవల కాలంలో గజపతినగరంలో వరుస దొంగతనాల ఘటనలు మండలంలో సంచలనం రేకెత్తించాయి. ఈ కేసును పోలీసులు ఛేదించారు. ఈ మేరకు స్థానిక పోలీసుస్టేషన్‌లో సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో సిఐ జివి రమణ వివరాలు వెల్లడించారు. గజపతినగరంలోని మేదరవీధికి చెందిన గ్రంధి హరిశంకర్, మరో బాలుడు కలిసి దొంగతనాలకు పాల్పడినట్లు గుర్తించారు. వారిని అరెస్టు చేసి, హరిశంకర్‌ను రిమాండ్‌కు, బాలుడిని జువైనల్ హోంకు తరలించినట్లు సిఐ తెలిపారు. చోరీ చేసిన రూ.14 వేలు నగదు రికవరీ చేసినట్లు చెప్పారు. వ్యాపారులు షాపుల ముందు సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌ఐ కిరణ్ కుమార్ నాయుడు పాల్గొన్నారు.

మహారాజశ్రీ గజపతినగరం సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్)
O.S No.140/24

Between :
బేత రమాదేవి వగైరాలు .....Plaintiffs
And :
దత్తి శివశంకరరావు ......Defendant
To
దత్తి శివశంకరరావు, S/o అప్పలనాయుడు, వయస్సు 45 సం॥లు, వ్యవసాయం, చినకాద గ్రామం, దత్తిరాజేరు మండలం, విజయనగరం జిల్లా.

పై ప్రతివాదులు పై నెంబరు O.S.No-140/24 పై కోర్టులో దాఖలు చేసియున్నారు. సదరు కేసులో మీకు ఎన్నిసార్లు నోటీసులు పంపించిన అందకపోవుచే ఇందుమూలముగా నోటీసు తెలపడం జరిగినది. కావున సదరు కేసు **తే 9-9-2025 ది, ఉ॥ 10-30 గం॥లకు** మీరు స్వయముగా గాని, వకీలు ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవచ్చును. లేనిచో మీ పరోక్షమున కోర్టువారు తగు విధముగా నిర్ణయించుదు.

R.S.Harinadha Rao,
Advocate for Plaintiff.
Gajapathinagaram.
Cell: 9441568473